# రోహిత్ రఫ్ఫాట

3-0తో సిరీస్ కైవసం


## మూడో టీ20లో భారత్ సూపర్ విక్టరీ • రోహిత్ అజేయ సెంచరీ

ఆహా.. ఏమా మ్యాచ్.. ఏమా ఉత్కంఠ! అఫ్గాన్‌తో సిరీస్‌లో చూసేందుకు ఏముంటుందిలే అని ఊహించిన వాళ్ల అంచనాలను తప్పని నిరూపిస్తూ.. ఆఖరి బంతి వరకు ఉత్కంఠ ఊపేసిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియాదే పైచేయి అయింది!

ఒక మ్యాచ్‌లో ఒక సూపర్ ఓవర్ చూస్తేనే సంబురపడిపోయే అభిమానులకు ఈ మ్యాచ్ విందు భోజనం వడ్డించింది.

సింహం రెండడుగులు వెనక్కి వేసిందంటే.. లంఘించి పంజా విసరబోతున్నట్లు.. గత రెండు మ్యాచ్‌ల్లో డకౌట్‌గా వెనుదిరిగిన హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ ఈ మ్యాచ్‌తో రికార్డుల దుమ్ము దులుపుతూ.. అజేయ శతకంతో కదం తొక్కితే.. తనలో ఫినిషర్‌తో పాటు మంచి యాంకర్ కూడా ఉన్నాడని అజేయ హాఫ్‌సెంచరీతో అండగా నిలిచిన రింకూ నిరూపించాడు.

22 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ సమయంలో.. రోహిత్, రింకూ తమ హిట్టింగ్‌తో చిన్నస్వామి స్టేడియాన్ని మోత మోగిస్తే.. నరాలు తెగే ఉత్కంఠ మధ్య రవి బిష్ణోయ్ రెండో సూపర్ ఓవర్‌లో చక్కటి బౌలింగ్‌తో మ్యాచ్‌ను భారత్ వశం చేశాడు. దీంతో టీమ్‌ఇండియా ఈ ఫార్మాట్‌లో తొమ్మిదో సిరీస్ క్లీన్‌స్వీప్ చేసి నయా చరిత్ర సృష్టించింది.


రింకూ (69*)

బెంగళూరు: పొట్టి ప్రపంచకప్‌నకు ముందు ఆడిన చివరి టీ20లో భారత్ అదరగొట్టింది. హోరా హోరీగా సాగిన పోరులో ఒక టికి రెండు సూపర్ ఓవర్లు జరిగినా.. ఒత్తిడిని జయించిన టీమ్‌ఇండియాను విజయం వరించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన ఆఖరి పోరులో భారత్ సూపర్ ఓవర్ ద్వారా విజయం సాధించి 3-0తో సిరీస్ క్లీన్ స్వీప్ చేసింది. గత రెండు మ్యాచ్‌ల్లో పెద్దగా ప్రతిఘటన కనబర్చలేకపోయిన అఫ్గాన్ ఈ సారి తుదికంటా పోరాడగా.. రోహిత్ రఫ్ఫాడించాడు. తొలుత టాస గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ (69 బంతుల్లో 121 నాటౌట్; 11 ఫోర్లు, 8 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగిపోగా.. నయా ఫినిషర్ రింకూసింగ్ (39 బంతుల్లో 69 నాటౌట్; 2 ఫోర్లు, 6 సిక్సర్లు) హాఫ్‌సెంచరీతో సారథికి అండగా నిలిచాడు. అఫ్గాన్ పేసర్ ఫరీద్ అహ్మద్ (3/20) ధాటికి ఒక దశలో 22 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ జట్టును ఈ జోడీ ఐదో వికెట్‌కు అజేయంగా 190 పరుగులు జోడించి భారీ స్కోరుకు బాటలు వేసింది. అనంతరం లక్ష్యఛేదనలో అఫ్గాన్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి సరిగ్గా 212 రన్స్ కొట్టింది. టాప్ త్రి రహ్మనుల్లా గుర్బాజ్ (50; 3 ఫోర్లు, 4 సిక్సర్లు), ఇబ్రహీం జద్రాన్ (50; 4 ఫోర్లు, ఒక సిక్సర్), గుల్బదీన్ నైబ్ (55 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్సర్లు) హాఫ్ సెంచరీలు చేయగా.. మహమ్మద్ నబీ (16 బంతుల్లో 34; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరుపులు మెరిపించాడు. భారత బౌలర్లలో సుందర్ మూడు వికెట్లు పడగొట్టాడు. రోహిత్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్', దూబేకు 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు దక్కాయి.

### సంక్షిప్త స్కోర్లు

భారత్: 212/4 (రోహిత్ 121 నాటౌట్, రింకూ 69 నాటౌట్; ఫరీద్ 3/20), అఫ్గానిస్థాన్: 212/6 (గుల్బదీన్ నైబ్ 55*, రహ్మనుల్లా 50; సుందర్ 3/18).

### సూపర్ ఓవర్లు సాగాయిలా

మ్యాచ్ టై కావడంతో ఫలితం తేల్చేందుకు సూపర్ ఓవర్ నిర్వహించగా.. మొదట బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్థాన్ ఆరు బంతుల్లో ఒక వికెట్ కోల్పోయి *16* పరుగులు చేసింది. ఛేదనలో రోహిత్ రెండు సిక్సర్లు బాదినా.. టీమ్‌ఇండియా కూడా *16* పరుగులకే పరిమితమైంది. దీంతో మరోసారి సూపర్ ఓవర్ నిర్వహించగా.. ఈసారి మొదట బ్యాటింగ్ చేసిన భారత్ *11* పరుగులు చేసి *2* వికెట్లు కోల్పోగా.. చేజింగ్‌లో అఫ్గాన్ ఒక్క పరుగుకే రెండు వికెట్లు చేజార్చుకొని పరాజయం వైపు నిలిచింది.

#### తొలి సూపర్ ఓవర్

| | |
|---|---|
| అఫ్గాన్: | 1+వికెట్,1,4,1,6,3 |
| భారత్: | 1,1,6,6,1,1, |

#### రెండో సూపర్ ఓవర్

| | |
|---|---|
| భారత్: | 6,4,1,వికెట్, వికెట్ |
| అఫ్గాన్: | వికెట్,1, వికెట్ |


రోహిత్ (121*)

**1** అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక (5) సెంచరీలు చేసిన ప్లేయర్‌గా రోహిత్ శర్మ రికార్డుల్లోకెక్కాడు. సూర్యకుమార్ యాదవ్, మ్యాక్స్‌వెల్ చెరో నాలుగు శతకాలతో రెండో స్థానంలో ఉన్నారు.

**1** ఈ మ్యాచ్‌లో రోహిత్, రింకూసింగ్ అభేద్యమైన ఐదో వికెట్‌కు 190 పరుగులు జోడించారు. టీ20ల్లో టీమ్‌ఇండియా తరఫున ఏ వికెట్‌కైనా ఇదే అత్యధికం. 2022లో ఐర్లాండ్‌పై శాంసన్-హుడా చేసిన 176 పరుగులు రెండో స్థానానికి చేరింది.

**1** పొట్టి ఫార్మాట్‌లో అత్యధిక (9) సిరీస్‌లు క్లీన్‌స్వీప్ చేసిన జట్టుగా టీమ్‌ఇండియా రికార్డుల్లోకెక్కింది. పాకిస్థాన్ 8 క్లీన్‌స్వీప్‌లతో రెండో స్థానంలో ఉంది.

టీ20ల్లో అత్యధిక సిక్సర్లు కొట్టిన కెప్టెన్‌గా ఇంగ్లండ్ మాజీ సారథి మోర్గాన్ (86)ను వెనక్కి నెట్టి రోహిత్ (90) అగ్రస్థానానికి చేరాడు. ఈ ఫార్మాట్‌లో అత్యధిక సిక్సర్లు (190) బాదిన ప్లేయర్ కూడా హిట్‌మ్యానే.

**1** పొట్టి ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత కెప్టెన్‌గా రోహిత్ శర్మ (1647), విరాట్ కోహ్లీ (1570)ని వెనక్కి నెట్టి అగ్రస్థానానికి చేరాడు. ధోనీ (1112) మూడో ప్లేస్‌లో ఉన్నాడు.

**4** టీ20ల్లో భారత్ తరఫున రోహిత్ (121*) నాలుగో వ్యక్తిగత అత్యధిక స్కోరు చేసిన ప్లేయర్‌గా నిలిచాడు. గిల్ (126*), రుతురాజ్ (123*), కోహ్లీ (122*) మొదటి మూడు స్థానాల్లో ఉన్నారు.



గిరిజన గురుకులాల ఇంటర్ సొసైటీ లీగ్ రాష్ట్ర స్థాయి పోటీలు ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు.

# ప్రజ్ఞానంద సంచలనం

- ప్రపంచ చాంపియన్‌పై అద్భుత విజయం
- విశ్వనాథన్ ఆనంద్‌ను దాటి అగ్రస్థానానికి



న్యూఢిల్లీ: భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద చరిత్ర సృష్టించాడు. టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్ నాలుగో రౌండ్‌లో ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)ను ఓడించి సంచలనం నమోదు చేశాడు. ఈ ప్రదర్శనతో 18 ఏండ్ల ప్రజ్ఞానంద భారత చదరంగ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్‌ను వెనక్కి నెట్టి భారత నంబర్‌వన్‌గా అవతరించాడు. తాజా ఫిడే ర్యాంకింగ్స్ ప్రకారం ప్రజ్ఞానంద 2748.3 పాయింట్లతో ప్రపంచంలో 11వ స్థానంలో ఉండగా.. ఆనంద్ 2748 పాయింట్లతో 12వ స్థానంలో ఉన్నాడు. బుధవారం జరిగిన పోరులో నల్లపావులతో బరిలోకి దిగిన ప్రజ్ఞానంద 62 ఎత్తుల్లో ప్రపంచ చాంపియన్‌పై గెలుపొందాడు. దీంతో క్లాసిక్ విభాగంలో ఆనంద్ తర్వాత ప్రపంచ చాంపియన్‌ను ఓడించిన రెండో భారతీయుడిగా రికార్డుల్లోకెక్కాడు. ప్రపంచ చాంపియన్‌పై గెలవడం చాలా ఆనందంగా ఉందని.. ఈ విజయ పరంపరను కొనసాగించాలనుకుంటున్నట్లు ప్రజ్ఞానంద తెలిపాడు.

# ఎన్‌సీసీ క్యాడెట్స్ దస్‌కా దమ్



హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణ, ఏపీ ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఆధ్వర్యంలోని ఈక్వెస్ట్రియన్ టీమ్ రిపబ్లిక్ డే హార్స్ షోలో ప్రతిభ కనబర్చి మొత్తం 10 పతకాలు కైవసం చేసుకుంది. దీంతో పాటు షో జంపింగ్ చాంపియన్ ఆఫ్ ది డే ట్రోఫీని కూడా ఒడిసి పట్టింది. రిపబ్లిక్ డే హార్స్ షో పోటీల్లో భాగంగా ఢిల్లీలోని ఆర్మీ ఈక్వెస్ట్రియన్ నోడ్‌లో జరిగిన పోటీల్లో.. తెలంగాణ, ఏపీ ఎన్‌సీసీ డైరెక్టరేట్ పరిధిలోని ఈక్వెస్ట్రియన్ బృందం 3 స్వర్ణ, 4 రజత, 3 కాస్యం పతకాలు చేజిక్కించుకుంది. షేక్ రెహానా షో జంపింగ్ ఛాంపియన్ ఆఫ్ ది డే ట్రోఫీ దక్కించుకుంది. ఈ బృందంలో మహ్మద్ ముజఫర్, కొర్ర గణేష్, చిట్టేశ్‌రావు, లోహిత్, భాను కృష్ణ తదితరులున్నారు. మంచి ప్రతిభ కనపర్చిన క్యాడెట్‌లను ఎన్‌సీసీ అధికారులు అభినందించారు.



పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన అర్జున అవార్డీ, హైదరాబాదీ షూటర్ ఇషాసింగ్‌ను బుధవారం కేంద్ర క్రీడాశాఖమంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ ఢిల్లీలో అభినందించారు. విశ్వక్రీడల్లోనూ సత్తాచాటి దేశ కీర్తి మరింత పెంచాలని ఆకాంక్షించారు.

# గాఫ్ సాఫీగా..

## జాబుర్‌కు చుక్కెదురు • జొకోవిచ్ ముందంజ • ఆస్ట్రేలియా ఓపెన్



సీజన్ ఆరంభ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియా ఓపెన్‌లో అమెరికా యువ సంచలనం.. కోకో గాఫ్ మూడో రౌండ్‌కు చేరింది. నాలుగో సీడ్‌గా బరిలోకి దిగిన గాఫ్ వరుస సెట్లలో ప్రత్యర్థిని మట్టికరిపించగా.. స్టార్ ప్లేయర్లు ఒన్స్ జాబుర్, వోజ్నియాకీ రెండో రౌండ్‌లోనే ఇంటి బాట పట్టారు. పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్ మూడో రౌండ్‌లో అడుగుపెట్టాడు.

మెల్‌బోర్న్: గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో సంచలన ప్రదర్శనతో టెన్నిస్ ప్రపంచాన్ని తనవైపు తిప్పుకుంటున్న అమెరికా యంగ్‌గన్ కోకో గాఫ్.. ఆస్ట్రేలియా ఓపెన్‌లో అదే జోరు కొనసాగిస్తున్నది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో నాలుగో సీడ్ గాఫ్ 7-6 (7/2), 6-2తో అమెరికాకే చెందిన డాల్టిడ్‌పై విజయం సాధించి మూడో రౌండ్‌లోకి ప్రవేశించింది. భారీ అంచనాల మధ్య బరిలోకి దిగిన ఆరో సీడ్ ఒన్స్ జాబుర్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ కరోలిన్ వోజ్నియాకీ రెండో రౌండ్‌లోనే పరాజయం పాలయ్యారు. గాఫ్ మ్యాచ్ విషయానికి వస్తే.. తొలి సెట్‌లో ప్రత్యర్థి నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొన్న గాఫ్ మ్యాచ్ మొత్తంలో మూడు ఏస్‌లు సంధిచి.. 4 డబుల్ ఫాల్ట్స్ చేసింది. 4 బ్రేక్ పాయింట్లు కాచుకున్న గాఫ్.. 20 విన్నర్లు సంధించగా.. 17 విన్నర్లకు పరిమితమైన ప్రత్యర్థి 41 అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకుంది. మరో మ్యాచ్‌లో జాబుర్ 0-6, 2-6తో ఆండ్రీవా చేతిలో ఓడగా.. వోజ్నియాకీ 6-1, 4-6, 1-6తో టిమోఫీఫా చేతిలో పరాజయం పాలైంది. ఇతర మ్యాచ్‌ల్లో రెండో సీడ్ సబలెంక 6-3, 6-2తో ప్రువిత్రోవాపై.. క్రెజికోవా 6-2, 6-2తో కోర్నాచ్‌పై.. హద్దద్ మైయా 6-1, 6-2తో కొర్నీవాపై గెలుపొందారు.

**జొకో జోరు:** అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన ప్లేయర్‌గా చరిత్ర సృష్టించడమే పనిగా ఆస్ట్రేలియా ఓపెన్ బరిలోకి దిగిన సెర్బియా వీరుడు నొవాక్ జకోవిచ్ మూడో రౌండ్‌లో అడుగుపెట్టాడు. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో బుధవారం జొకో 6-3, 4-6, 7-6 (7/4), 6-3తో పాప్రిన్‌పై గెలుపొందాడు. ఇతర మ్యాచ్‌ల్లో రుబ్లేవ్ 6-4, 6-4, 6-4తో యుబంక్స్‌పై.. సిట్సిపాస్ 4-6, 7-6 (8/6), 6-2 7-6 (7/4)తో థాంప్సన్‌పై.. సిన్నెర్ 6-2, 6-2, 6-2తో డిజాంగ్‌పై గెలుపొందాడు.


కమిన్స్ (4/41)

# పేసర్ల ప్రతాపం

- వెస్టిండీస్ 188 ఆలౌట్
- ఆస్ట్రేలియాతో తొలి టెస్టు

అడిలైడ్: పేసర్లు సత్తాచాటడంతో వెస్టిండీస్‌తో బుధవారం ప్రారంభమైన తొలి టెస్టులో ఆస్ట్రేలియా మంచి స్థితిలో నిలిచింది. కమిన్స్ (4/41), హజిల్‌వుడ్ (4/44) ధాటికి విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 188 పరుగులకు ఆలౌటైంది. మెకంజీ (50) ఒక్కడే అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కంగారూలు ఆట ముగిసే సమయానికి 59/2తో నిలిచారు. వార్నర్ టెస్టులకు వీడ్కోలు పలకగా.. అతడి స్థానంలో స్టీవ్ స్మిత్ ఓపెనర్ అవతారమెత్తాడు. ఉస్మాన్ ఖవాజా (30), కామెరూన్ గ్రీన్ (6) క్రీజులో ఉన్నారు.

# అక్షర్ @ 5

దుబాయ్: ఇటీవల నిలకడగా రాణిస్తున్న టీమ్‌ఇండియా యువ ఆటగాళ్లు అక్షర్ పటేల్, యశస్వి జైస్వాల్ తొలిసారి ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ టాప్-10లో చోటు దక్కించుకున్నారు. బౌలింగ్‌లో అక్షర్ పటేల్ కెరీర్ అత్యుత్తమ ఐదో స్థానం దక్కించుకోగా.. ఓపెనర్ జైస్వాల్ ఆరో ప్లేస్‌లో నిలిచాడు. అఫ్గానిస్థాన్‌తో సిరీస్‌లో సత్తాచాటిన ఈ ఇద్దరూ బుధవారం ఐసీసీ ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకున్నారు.

# సాత్విక్ జోడీ బోణీ



న్యూఢిల్లీ: గత వారం మలేషియా ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన భారత స్టార్ షట్లర్లు సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి.. ఇండియా ఓపెన్‌లో బోణీ కొట్టారు. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీ పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బుధవారం సాత్విక్-చిరాగ్ జంట 21-15, 19-21, 21-16తో ఫాంగ్ చెహ్ లీ-ఫాంగ్ జెన్ లీ (చైనీస్ తైపీ) ద్వయంపై విజయం సాధించారు. ప్రత్యర్థి నుంచి గట్టి ప్రతిఘటన ఎదురైనా.. ఏమాత్రం వెనక్కి తగ్గకుండా ఈ జంట అద్వితీయ ప్రదర్శన కనబర్చింది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో కిడాంబి శ్రీకాంత్ 22-24, 13-21తో లీ చెక్ యూ (హాంకాంగ్) చేతిలో ఓటమి పాలయ్యాడు.

# అలెన్ అదుర్స్



డునెడిన్ (న్యూజిలాండ్): ఓపెనర్ ఫిన్ అలెన్ (62 బంతుల్లో 137; 5 ఫోర్లు, 16 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగిపోవడంతో.. న్యూజిలాండ్ జట్టు పాకిస్థాన్‌పై 3-0తో సిరీస్ కైవసం చేసుకుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన మూడోటీ20లో న్యూజిలాండ్ 45 పరుగుల తేడాతో పాక్‌ను చిత్తుచేసింది. పొట్టి ఫార్మాట్‌లో ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు (16) కొట్టిన బ్యాటర్‌గా హజ్రతుల్లా జజాయ్‌ను అలెన్ సమం చేశాడు. అలెన్ ధాటికి తొలుత న్యూజిలాండ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 224 పరుగులు చేసింది. న్యూజిలాండ్ తరఫున పొట్టి ఫార్మాట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన ప్లేయర్‌గానూ అలెన్ నిలిచాడు. అనంతరం లక్ష్యఛేదనలో పాకిస్థాన్ 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 179 పరుగులకు పరిమితమైంది. బాబర్ ఆజమ్ (58) టాప్ స్కోరర్.

**1** అంతర్జాతీయ టీ20ల్లో ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు (16) బాదిన బ్యాటర్‌గా అలెన్.. హజ్రతుల్లా జజాయ్ (16; అఫ్గానిస్థాన్) సరసన నిలిచాడు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.